# ముప్పదిరెండవ ప్రసంగము.

శ్రీప్రకాశానందస్వామివారు ఒకప్పుడు జేతపురమునందుండగా దామజీభాయి రాజకోటనుండి వెళ్లి వారిని తీసికొనివచ్చిరి. వారితో మోహనభాయి, శంకరభాయి ఉండిరి. సాయంకాలము 5 గంటలకు వారందరును రాజకోటకు బయలుదేరిరి. మొదట అనుకొనిన ప్రకారము వారు మార్గమధ్యమునందలి పీఠడియాలో ఆగి శ్రీనిత్యానందస్వామివారి దర్శనార్థము వెళ్లిరి. ఆప్రసంగమున శంకరభాయి జీవబ్రహ్మైక్యభేదమును తెలుపు భజనను ఒకదానిని పాడెను. అదివినుటతోడనే శ్రీనిత్యానందస్వామివారి నేత్రములనుండి ఆనందాశ్రువులు బయలువెడలినవి.

## జీవబ్రహ్మైక్యభేదము.

స్వా. సి. :— శ్రుతులయందు జీవబ్రహ్మైక్యభేదము చాల యుక్తియుక్తముగా ప్రతిపాదించబడినది. అది మహావాక్యముల ద్వారానే తెలియును. *1.* ప్రజ్ఞానం బ్రహ్మ 'ప్రజ్ఞానము బ్రహ్మము.' *2.* అయమాత్మా బ్రహ్మ 'ఈఆత్మ బ్రహ్మము' *3.* అహంబ్రహ్మాస్మి 'నేను బ్రహ్మమును.' *4.* తత్త్వమసి 'అది నీవు.' ఇటువంటి అపరోక్షబోధకములగు వాక్యములద్వారా జీవబ్రహ్మైక్యభేదము స్పష్టముగా కన్పించును.

*4.* తత్త్వమసి—ఈమహావాక్యమున తత్; త్వమ్, అసి అను మూడుపదములు కలవు. ఇందలి 'తత్' పదముచే సర్వజ్ఞుడును, సర్వశక్తివిశిష్టుడును అగు దేవుడు గ్రహించబడును "త్వమ్" పదముచే అల్పజ్ఞుడును, అల్పశక్తివిశిష్టుడును అగు జీవుడు గ్రహించబడును. ఈ ఇరువురును పరస్పరవిరుద్ధములగుటచే ఇరువురి అభేదమును అసంభవము. కాని భాగత్యాగలక్షణచే బ్రహ్మైక్యభేదము సిద్ధించును. ఒక

రకపు బంగారములో వెండియు, రెండవరకపు బంగారములో రాగియు కలిసినవి అనుకొనుడు. ఒకటి వెండికలసిన బంగారము అనెదరు. రెండవది రాగికలసిన బంగారము అనెదరు. కాని అగ్నిలో కరగించగనే వెండియును, రాగియు వేరయి రెంటియందును ఉన్న బంగారముమాత్రమే మిగులును. అటులనే ఈశ్వరోపాధియుతమగు సర్వజ్ఞత్వమును, సర్వశక్తిమత్త్వమును విడనాడి కేవలము తత్ పద లక్ష్యార్థమగు చైతన్యమును జీవనోపాధియుతమగు అల్పజ్ఞ, అల్పశక్తిమత్త్వములను త్యజించి కేవలచైతన్యభాగమునే గ్రహించినచో ఉభయులకును అభేదము సిద్ధించును. తత్పదవాచ్యార్థమగు సర్వజ్ఞుడును సర్వశక్తివిశిష్టుడునగు ఈశ్వరునకును, త్వమ్పదవాచ్యార్థమగు అల్పజ్ఞుడును, అల్పశక్తివిశిష్టుడును అగుజీవునకును ఉభయులకునుఅభేదము సిద్ధించును. కాని లక్షణచే తత్పదలక్ష్యార్థమగు చైతన్యము, త్వంపదలక్ష్యార్థమగు చైతన్యము రెంటికిని అభేదము సిద్ధించును. శుద్ధబ్రహ్మమునందు జగము అంతయును అధ్యస్తము అనగా దానియందు ఉన్నది. బ్రహ్మజ్ఞానాంతమున అందే లయమును పొందును. శుద్ధ బ్రహ్మము, త్వమ్పదలక్ష్యార్థమగు సాక్షిచైతన్యము- ఈరెండును ఒకటే అయినందున శుద్ధబ్రహ్మమునందు జగముయొక్క ఉత్పత్తి స్థితి లయములు ఉన్నవి.

అటులనే సాక్షిచైతన్యముకూడ ఉత్పత్తి స్థితిలయములకు అధిష్ఠానము. ఈజీవబ్రహ్మైభేదమును తెలుపుసిద్ధాంతమును శ్రుతి స్వయముగా చెప్పుచున్నది.

మయ్యేవ సకలం జాతం మయిసర్వం ప్రతిష్ఠితమ్।
మయి సర్వం లయం యాతి తద్ బ్రహ్మాద్వయ మస్మ్యహమ్॥

"శుద్ధబ్రహ్మాభిన్నమగు నేను సాక్షిని. దానినుండియే ఈజగమంతయును ఉద్భవించినది. నాయందే స్థితిని పొందుచున్నది. నా

యుం దే లయమును పొందుచున్నది. ఏలనన నేనే అద్వయుడగు బ్రహ్మస్వరూపుడను."

జగముయొక్క ఉత్పత్తిస్థితిలయములన్నియును నాయందే కల్పితములు. నా అస్తిత్వమునకు భిన్నమగు వేరొక అస్తిత్వము లేదు. అధిష్ఠానమగు అస్తిత్వమునకు భిన్నమగు కల్పితపదార్థమునకు అస్తిత్వము లేకపోవుటయే ఇందుకు కారణము. ముత్యపుచిప్పయందు కల్పించబడిన వెండియొక్కయు, త్రాడుయందు కల్పించబడిన సర్పముయొక్కయు అస్తిత్వము క్రమముగా ముత్యపుచిప్ప యొక్కయు, వెండియొక్కయు అస్తిత్వములకు భిన్నముకానట్లు జగముయొక్క అస్తిత్వముకూడ సాక్షికి భిన్నముకాదు. విద్యమానమగు జగమంతయు నాయందు కల్పించబడినది. నేను సాక్షిని. ఆజగమునకు అధిష్ఠానమును.

ఇట్లు శ్రుతిని వివరించి స్వామివారు జీవబ్రహ్మభేదమునువర్ణించిరి ఇది వినిన రామజీభాయి ఇట్లనెను:- "ఇది గంభీరవిషయము. మావంటివారలకు ఇది తెలియదు. కావున మావంటివారలకు తెలియు సులభమార్గమును దేనినైన తెలుపగోరుచున్నాను."

స్వామి శ్రీనిత్యానందులవారు శ్రీప్రకాశానందులవారిని రామజీభాయికి తెలియునట్లు తెలుపమని కోరిరి.

## సామాన్యులకు సులభమగునది భక్తి.

స్వా. ప్ర. :— మీవంటివారలకు భక్తి శ్రేష్ఠమైనది. భక్తి సూత్రములయందు నారదమహాముని చెప్పెను:- అన్యస్మాత్ సౌలభ్యం భక్తౌ।

కర్మయోగ జ్ఞానయోగములకంటె భక్తి సులభము. కర్మయోగమునకు ధనము కావలెను. జ్ఞానయోగమునకు విద్య కావలెను. వర్ణాశ్రమభేదముచే అధికారిభేదముకూడ అందు కన్పించుచున్నది. ద్విజులకు వేదాధికారము కలదనియును, స్త్రీశూద్రాదులకు పురా

**కాధికారము** కలదనియును- ఇట్టి రకరకములగు భేదములు **అందు పాటించబడినవి.** కాని భక్తియందు అన్ని వర్ణములవారికిని, **ఆశ్రమ ములవారికిని అధికారము** కలదు. **అది** సులభము. భక్తిలక్షణముఇట్లు చెప్పబడినది:- సా త్వస్మిన్ పరమప్రేమరూపా।

"కేవలము ప్రభువునందుమాత్రమే ప్రేమకలిగియుండుట భక్తి."

**భక్తి** రెండురకములు:— 1. గౌణి 2. ముఖ్య.

గౌణి.

"గౌణీ త్రిధా గుణ భేదాదార్తాదిభేదాద్వా" అని గౌణి భక్తిసూత్ర **ములయందు** వివరించబడినది.

గుణభేదముచేతను, ఆర్తాదిభేదముచేతనుకూడ గౌణీభక్తి **మూడురకములు.**

**గుణ**భేదముచే అనగా సత్త్వరజస్తమోభేదముచే **మూడు రకములు.** శ్రీమద్భాగవతము చెప్పుచున్నది:-

అభిసంధాయ యద్ధింసాం దమ్భం మాత్సర్యమేవ వా ।
సంరమ్భీ భిన్నదృగ్భావం మయి కుర్యాత్ స తామసః॥

"ఇతరులను బాధించవలెనను ఉద్దేశ్యముతో, కపటము చేయ వలెననెడు తలంపుతో లేక పరోత్కర్షాసహిష్ణుత్వముతో క్రోధము, భేదభావము- ఈరెండును కలిగియుండి విగ్రహములయందు దైవ భక్తిని కలిగియుండుట తమోగుణవిశిష్టమగు భక్తి అనబడును."

విషయానభిసంధాయ యశ ఐశ్వర్యమేవ వా ।
అర్చాదావర్చయేద్యో మాం పృథగ్భావః స రాజసః॥

"విషయేచ్ఛతోను, యశమును పొందవలెననెడు కోరికతోను ఐశ్వర్యమును పొందవలెనను కోరికతోను భేదదృష్టితో విగ్రహాదు **లను** పూజించిన రజోగుణవిశిష్టమగు భక్తి అనబడును."

కర్మనిర్హారముద్దిశ్య పరస్మిన్వా తదర్పణమ్ ।
యజేద్యష్టవ్యమితి వా పృథగ్భావః స సాత్త్వికః॥

"పాపక్షయమును దృష్టియందుంచుకొనియు, కర్మను-పరమాత్మునికి అర్పించి దేవుని సంతోషపెట్టవలెనను తలంపుతోను, యజ్ఞాదికర్మలు చేయుట యుక్తము అనెడు భావముతోను కర్మలు చేయుచు భేదదృష్టితో విగ్రహాదులయందు దైవభక్తి కలవాడు సత్త్వగుణవిశిష్టుడగు భక్తుడు."

ఆర్తాదిభేదమున భక్తి నాలుగు రకములు.

*చతుర్విధా భజన్తే మాం జనాః సుకృతినోఽర్జున ।*
*ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ॥*

అని భగవద్గీత తెలుపుచున్నది.

"నాలుగురకములకు చెందిన సత్కార్యనిరతులగు జనులు దేవుని భజించుదురు. 1. ఆర్తుడు 2. జిజ్ఞాసువు 3. ధనార్థి 4. జ్ఞాని."

1. ఆర్తుడు:— దుఃఖించువాడు.

కౌరవసభలో ద్రౌపదివస్త్రములను విప్పుమని దుర్యోధనుడు ఆజ్ఞాపించెను. ఈ తగనిఆజ్ఞను వినినంతనే ద్రౌపది సభలో కూర్చొనియున్న భీష్ముడు, ద్రోణుడు మొదలగు పెద్దలందరి ముఖములవైపును చూచెను. అటుతరువాత ఆమె పాండవులవైపు చూచెను. కాని వారు అందరును తలలు వంచుకొని కూర్చొనియుండిరి. వారిలో ఎవరికిని ఆమెను రక్షించుసామర్థ్యము లేకుండెను. ఈసంగతిని గమనించి ఆమె కృష్ణపరమాత్ముని ప్రార్థించెను.

2. జిజ్ఞాసువు:— ఆత్మజ్ఞానము పొందవలెనను తలంపు కలవాడు. ముచికుందుడు, జనకుడు, ఉద్ధవుడు మొదలగువారు ఆత్మజ్ఞానముకొరకు ప్రభువును ఆరాధించెను.

3. అర్థార్థి:— ఇహలోకమునందుకాని, పరలోకమునందు కాని భోగసాధనములగు అర్థమును కోరువాడు. సుగ్రీవుడు, విభీషణుడు, ఉపమన్యుడు మొదలగువారు ఇహలోకభోగములకొరకును, ధ్రువాదులు పరలోకభోగములకొరకును ఆరాధించిరి.

పైచెప్పిన మూడురకముల భక్తులును గౌణభక్తులు. ముఖ్యభక్తులు. పరాభక్తు లనబడుదురు. 'జ్ఞానీచ భరతర్షభ '। అని శ్లోకమునందు వర్ణించిన జ్ఞాని ముఖ్యభక్తుడు. లేక పరాభక్తుడు. సనకాదులు, నారదుడు, ప్రహ్లాదుడు, పృథుమహారాజు, శుకుడు మొదలగువారు జ్ఞానులగు భక్తులు, ఈగౌణీభక్తి ముఖ్యభక్తికి కారణము

భక్తిసూత్రములయందు నారదమహాముని చెప్పెను:-

*ఉత్తరస్మాదుత్తరస్మాత్ పూర్వాపూర్వా శ్రేయాయ భవతి ।*

గౌణీభక్తి ముఖ్యభక్తి ఈరెండింటిలోను ముందుదానికంటె తరువాతిది శ్రేష్ఠము. భాగవతమున శ్రవణాది నవభక్తులు చెప్పబడినవి. అవికూడ గౌణీభక్తికోటికే చెందును.

## నవవిధభక్తులు

*శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్ ।*
*అర్చనం వన్దనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్ ॥*

"విష్ణుభగవానుని శ్రవణముచేయుట, కీర్తించుట, స్మరించుట, పాదసేవచేయుట, అర్చించుట, వందనముచేయుట, దాస్యము, సఖ్యము, ఆత్మనివేదనము - అను ఈతొమ్మిదియును భక్తియందలి రకములు.

1. శ్రవణము:—భగవానుని గుణానువాదమును ప్రేమతో వినుట శ్రవణము. పరీక్షిత్ మహారాజు శ్రవణభక్తితో 7 రోజులలో ప్రభువును పొందెను.

2. కీర్తనము:—ప్రేమతో భగవానుని గుణానువాదమును కీర్తించుట. నారదమహాముని నిరంతరము ప్రభుని గుణగానముచే ప్రభుసాక్షాత్కారమును పొందెను.

3. స్మరణము: — ఉత్సాహముతో ప్రభుస్వరూపమును హృదయమున నిలిపి స్మరించుట. ప్రహ్లాదుడు ఎల్లప్పుడును ప్రభువును హృదయమున స్మరించి ప్రభువును పొందెను.

4 పాదసేవ:— నిత్యము ప్రభువు చెంతనుండి పాదసేవ చేయుట. లక్ష్మణుడు శ్రీరామచంద్రుని పాదములను సేవించి ప్రభువును సంతోషపెట్టెను. పాదసేవ అనుమాట సర్వవిధములగు సేవలకును ఉపలక్షణముగా గ్రహించవలెను.

5. అర్చన:—రామకృష్ణాది మూర్తులను షోడశోపచారములతో పూజించుట అర్చనభక్తి అనబడును. అంబరీషుడను మహారాజు అర్చనభక్తితో తరించెను. ఈనాడు రామకృష్ణాది అవతారములు ప్రత్యక్షముగా గోచరించవు. కావున వాని విగ్రహములను ఉంచి పూజించుట అర్చనభక్తి అనబడును. విగ్రహములు మూడు రకములు :—

1. సాత్త్వికములు. 2. రాజసికములు, 3. తామసికములు. శుక్రనీతియందు ఈవిషయము వివరించబడినది.

యోగముద్రాన్వితా స్వస్థా వరాభయకరాన్వితా ।
దేవేన్ద్రాదిస్తుతా యా చ సాత్త్వికీ సా ప్రకీర్తితా॥

"యోగముద్రతో కూడినదికాని, స్వస్థమగు విగ్రహముకాని, వరాఽభయహస్తములు కలదికాని, ఇంద్రాదిదేవతలచే స్తుతించబడినదికాని సాత్త్వికవిగ్రహము అని చెప్పబడును."

1. యోగముద్రతోకూడినది:- అర్ధోన్మీలితనేత్రద్వయముతో దృష్టిని భ్రూమధ్యమున అనగా-నాసికాగ్రమున నిలిపినది.

2. స్వస్థ:— పద్మాసనమున శాంతభంగిమముతో నున్నది.

3. వరాఽభయకరాన్విత:— అభయ వరదహస్తములతో కూడినది. వరములను, అభయమును ఇచ్చుచున్నట్లు ఉన్న విగ్రహము. ఎడమచేయి పైకిఎత్తి చూపుచు అభయమును ఇచ్చుచుండుటయును, కుడిచేయి వరమును ఇచ్చుచున్నట్లు ఉండుటయును కలది.

4. ఇంద్రాదిసంస్తుత:—ఇంద్రాదిదేవతలు వినయముతో సూక్తములద్వారా స్తవముచేయుచు ఉండుట.

పైజెప్పిన నాలుగురకముల విగ్రహములును సాత్త్వికవిగ్రహములు. ఈవిధములగు సాత్త్వికవిగ్రహములనుపూజించువారు, తరుచు ముముక్షువులు అయియుందురు. సాత్త్వికవిగ్రహములు సాత్త్వికముద్రలతో కూడియుండును. యోగముద్ర, జ్ఞానముద్ర, అభయముద్ర, వరముద్ర — అనునవి సాత్త్వికముద్రలు. సాత్త్వికముద్రాన్వితములగు విగ్రహములను, సాత్త్వికముద్రలను చూచుటచే పాపములు నశించును, పుణ్యము కలుగును, కోరికలన్నియును సిద్ధించును అని శాస్త్రజ్ఞులు చెప్పిరి.

మోదనాత్సర్వదేవానాం ద్రావణాత్పాపసంతతేః ।
తస్మాద్ ముద్రేతి సా ఖ్యాతా సర్వకామార్థసాధనీ॥

"దేవతలందరును ప్రసన్నలగుటయును పాపములన్నియును తొలగిపోవుటయును, కోరినపదార్థములనన్నిటిని లభింపజేయునదియును 'ముద్ర' అని జగత్ప్రసిద్ధము." ఉత్తమముద్రాన్వితములగు సాత్త్వికవిగ్రహములను ధ్యానించుటచే చిత్తమునకు స్థైర్యము కలుగును. లయ, కషాయ, విక్షేప, రసాస్వాదాది దోషములు సాత్త్విక పూజకునికి ధ్యానమునందు ప్రతిబంధకములుగా నుండవు. సాత్త్వికవిగ్రహమును అర్చించుటచే ధ్యానాదులద్వారా జ్ఞానము కలుగును. "సత్త్వాత్ సంజాయతే జ్ఞానమ్," అనిచెప్పబడినది. సాత్త్వికవిగ్రహమును ధ్యానించుటచే, సత్త్వగుణవిశిష్టులగు సత్పురుషుల ఉపదేశములచే సత్త్వాధిక్యముచే జ్ఞానోత్పత్తి యగును. అనన్యభావముతో సాత్త్వికవిగ్రహారాధన చేయుచున్న భగవద్భక్తుని హృదయమున నేను దాసుడను అనుభావము ప్రథమమున ఉద్భవించును, ఇంకను పరిపాకమును పొందినపిమ్మట పూజకుని హృదయమున

"పూజ్యుడగు దేవుడు నాసత్త్వము" అనుభావము కలుగును. ఈభావ పరిపాకాంతమున పూజ్యుడు తనస్వరూపము అని అంగీకరించును. మధుసూదన సరస్వతీస్వాములవారు భగవానుని శరణుజొచ్చినచో సాధనాపరిపక్వ కలిగినంతనే ముముక్షుత్వము లభించును అని చెప్పిరి:—

తస్యైవాహం మమైవాసౌ స ఏవాహమితి త్రిధా ।
భగవచ్ఛరణత్వం స్యాత్ సాధనాభ్యాసపాకతః॥

"సాధనాభ్యాసము పరిపక్వమయినకొలదియు భగవానుని శరణునందు క్రమక్రమముగా మూడురకముల భావపరివర్తనము కలుగును. 1. నేను ఆతనివాడను. 2. భగవానుడు నావాడు. 3. నేను ఆతనినే."

పైన చెప్పబడిన సాత్త్వికవిగ్రహారాధన చేయువాడు పరిపక్వావస్థయందు పూజ్యుడే అగును.

శుక్రనీతియందు చెప్పబడినది:—

## రాజస విగ్రహము

తిష్ఠతి వాహనస్థా వా నానాభరణభూషితా,
యా శస్త్రాస్త్రాభయవరకరా సా రాజసీ స్మృతా॥

"నిలబడికాని, వాహనముపై కూర్చొనికాని, వివిధాలంకారములతో అలంకరింపబడికాని, శస్త్రాస్త్రములతోను, వరదాభయహస్తములతోను కాని ఉన్నవిగ్రహము రాజసవిగ్రహము."

అర్థార్థులగు అర్చకులు తరచు రాజసవిగ్రహమును పూజించుదురు. రాజసవిగ్రహలక్షణము శాస్త్రజ్ఞులు ఇట్లు చెప్పిరి:— నిలబడికాని, గరుడ, వృషభ, సింహాదివాహనారూఢమైకాని ఉన్నను, అనేకవిధములగు అలంకారములను అలంకరించుకొని, వివిధశస్త్రాస్త్రములను ధరించి అభయ,వరదహస్తములతోనున్నను అట్టి విగ్రహము

రాజసవిగ్రహ మనబడును. రాజసవిగ్రహమును పూజించువారి హృదయములయందు సాత్త్వికభావములు ఉదయించుట అరుదు. ఏలనన దేవతయొక్క ఆకారమునుబట్టి ధ్యానముచేయువాని హృదయభావములు నిర్మితమగును.

తమోగుణవిశిష్టమగు విగ్రహమును గురించి శుక్రనీతి ఇట్లు చెప్పుచున్నది.

*శస్త్రాస్త్రైర్దైత్యహన్త్రీ యా ఉగ్రరూపధరా సదా ।*

*యుద్ధాభినన్దినీ సా తు తామసీ ప్రతిమోచితా॥*

"శస్త్రాస్త్రములతో దైత్యసంహారము చేయునట్టిదియు, ఎల్లప్పుడును ఉగ్రరూపమును ధరించినట్టిదియును, యుద్ధమునందు ఆనందమును కలిగియుండునట్టిదియును అగు విగ్రహము తామసవిగ్రహము అనబడును."

కత్తులు మొదలగు శస్త్రములను, త్రిశూలము, చక్రము మొదలగు అస్త్రములను ధరించి దైత్యసంహారముచేయుచు ఉండునట్టిదియు, ఎల్లప్పుడును ఉగ్రరూపమును ధరించునట్టిదియు, యుద్ధమునందు ఇచ్ఛ కలిగినట్టిదియు అగు విగ్రహము తామసవిగ్రహము. ఇట్టి విగ్రహమును తమోగుణవిశిష్టులగు అర్థార్థులు పూజించెదరు. ఆపూజవలనకలుగు ఫలితము స్వల్పమే. తామసప్రతిమను పూజకాని, ధ్యానముకాని చేయువారికి సాత్త్వికమనస్తత్త్వము కలుగదు. ఏలనన తమోగుణవిశిష్టమగు విగ్రహమును పూజించుటచే నాతని మనస్సునందు తామసభావములే జనించును.

6. వందనము:— సాష్టాంగదండప్రణామము ప్రభుచరణములకు ప్రేమతో నమస్కరించుట వందనభక్తి అనబడును. అక్రూరుడు శ్రీకృష్ణపరమాత్మునకు అత్యంతమగు ప్రేమతో నమస్కరించి ప్రభువును పొందెను.

7. దాస్యము:— ప్రభువు నాజ్ఞలను ప్రేమతో పాటించుట దాస్యభక్తి అనబడును. హనుమానుడు శ్రీరామచంద్రుని నాజ్ఞలను యథార్థముగా పాటించి సంతుష్టిపరచెను.

8. సఖ్యము:— ప్రభువుయందు ప్రేమతో మైత్రిని నెరపుట సఖ్యభక్తి. అర్జునుడు శ్రీకృష్ణపరమాత్మునితో అనుకూలముగా వ్యవహరించెను. అది సఖ్యభక్తి.

9. ఆత్మనివేదనము:— సర్వస్వమును అర్పించుట ఆత్మనివేదనము అనుభక్తి. బలిచక్రవర్తి ప్రేమతో తనసర్వస్వమును ప్రభుచరణములయందు సమర్పించెను.

సమగ్రముగా ఆలోచించిచూచిన ఆత్మనివేదనము అను భక్తి పద్ధతియందు ముందు తెలపిన భక్తిపద్ధతులు అన్నియును సమావేశమగును.

కృత్వా దేహాదికం తస్య ప్రీత్యై సర్వం తదర్పణమ్,
నిర్వాహాయ చ శూన్యత్వం యత్తదాత్మసమర్పణమ్॥

"పరమాత్మవి ప్రేమకొరకు తనదేహాదులు అన్నియును ఆతనికి సమర్పించి తననిర్వాహణకు శూన్యత్వమును ఉంచుకొనవలెను. (అనగా ఏమియును మిగుల్చుకొనరాదు. ఇది ఆత్మసమర్పణము అనుభక్తి. ఈ తొమ్మిదివిధములుగను చెప్పబడు భక్తి గౌణి అనబడును.

"గౌణ్యా తు సమాధిసిద్ధిః" అని శాండిల్యభక్తిసూత్రములు చెప్పుచున్నవి.

ఈ శ్రవణాది నవవిధములగు భక్తిచేతను సమాధిలాభము కలుగుచున్నది. గౌణిభక్తినే అపరభక్తి అని అందురు. ఈతొమ్మిది విధములగు భక్తిచేతనే సవికల్పసమాధిద్వారా నిర్వికల్పసమాధి ప్రాప్తించును. నిర్వికల్పసమాధిచే సాక్షాత్కారము కలుగును. అదియే ముఖ్యభక్తి లేక పరాభక్తి అని అనబడును.

ఈరోజులలో మీరందరును చెప్పునది నిజమగు భక్తి కాదు. శ్రవణ, కీర్తనాదులు 8 మాత్రము కన్పించును. కాని ఆత్మనివేదనముమాత్రము కానవచ్చుట లేదు. ఆత్మనివేదనము తప్ప మిగిలినవి అన్నియును భక్తియొక్క ఆభాసమాత్రములే. ప్రభువుపై ఆస్తిక్యబుద్ధి లేకపోవుటయే ఇందుకు కారణము. ఆస్తిక్యబుద్ధి యున్నచో రేపుగురించి చింతించవలసిన అవసరము ఏమి?

## గీతాపండితుని ఆస్తిక్యబుద్ధి.

ఒకానొకగ్రామమున ఒక బ్రాహ్మణపండితుడు ఉండెడివాడు. అతడు శ్రీకృష్ణపరమాత్మని పరమభక్తుడు. నిత్యము గీతను పఠించుచుండెడివాడు. అందుచే నాతడు గీతాపండితుడని పిలువబడెడివాడు. కుటుంబమును పోషించుటకు ఏమియును పురుషార్థమును ఆచరించెడివాడు కాడు. అయాచితముగా అనాయాసముగా లభించినదానితో కుటుంబపోషణమును చేసెడివాడు. ఈవిధముగా జరుగుచుండగా ఒకప్పుడు పెద్దకరువు వచ్చెను. అందుచే జీవితనిర్వహణము కష్టమయ్యెను. భార్య అతనితో కుటుంబనిర్వహణమునకు పురుషార్థమును చేయుమని అనేకమారులు చెప్పుచుండెడిది. "ఇంతవరకును నేను యాచించలేదు. కావున ఇకముందు నేను యాచించుటకు వెళ్ళను." అని అతడు చెప్పెను. అంతట భార్య ఇట్లనెను:- "పిల్లలు మనము ఆకలితో చచ్చిపోవుచున్నాము. బ్రాహ్మణులము కదా! గ్రామములోనికి వెళ్లి ఏదియో ఒకటి యాయవారము అడిగి తీసికొనిరండు." అందుకుకూడ ఆబ్రాహ్మణుడు ఇష్టపడలేదు, ప్రభువునందు శ్రద్ధాభక్తులను కలిగియుండమని చెప్పెను. "ప్రభువునందు శ్రద్ధాభక్తులు కలిగియుండుటచే కడుపు నిండదు." అని భార్య మరల సమాధానము చెప్పెను.

అంతట గీతాపండితుడు ఆమెకు ఇట్లు నచ్చచెప్పెను. గీతయందు శ్రీకృష్ణపరమాత్ముడు చెప్పెను.

అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే,
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్.

"నాయందలి అనన్యభక్తితో నన్ను చింతనచేయుచు, నన్ను ఉపాసించుచు, నాయందు నిత్యము ప్రేమను చూపుచు ఉండు నాభక్తుల యోగక్షేమములను నేను చూచెదను."

యోగము అనగా లభించనిది లభించునట్లు చేయుట. క్షేమము అనగా లభించినదానిని కాపాడుట. గీతయందు శ్రీకృష్ణభగవానుడు చెప్పినప్రకారము ఆయనయందు శ్రద్ధకలిగియుండుము అని బ్రాహ్మణుడు భార్యతో చెప్పెను. దానికి ఆమె ఇట్లనెను. :—

"ఆ వ్రాసినది తప్పు" అని తాళపత్రగ్రంధమునందు ఉన్న ఆశ్లోకమును ఆమె గంటముతో ముమ్మారు కొట్టివేసెను. అంతట గీతాపండితుడు మిగుల కోపించి చెప్పెను.

"నాప్రభువునందు నీకు నమ్మకము లేదా? ఇది ఏమి ఇట్లు చేసితివి!" అని మిక్కిలి ఖేదముతో ఆయన ఇంటినుండి బయలువెడలి ఒక ఏకాంతస్థానమున గీతాపాఠము చేయుచు కూర్చొనెను. అటు తరువాత ఒక యువకుడగు గొల్ల ఒకకావిడిలో పప్పు, పిండి, నెయ్యి, పెరుగు, పంచదార, కూరలు మొదలగు పదార్థములను తీసికొని గీతాపండితుని ఇంటికి వచ్చెను. అతడు కావిడి దింపుకొని ఎంతయో అలసిపోయినట్లు కూర్చొనెను. గీతాపండితుని భార్య ఆతనిని అడిగెను.

"ఇవి అన్నియును ఎవరు పంపెను?"

మాయజమాని శేటుగారు ఆసామానులు స్వయంపాకమునకు మీకు పంపెను. తీసికొనుడు అని గొల్ల సమాధానము చెప్పెను. గీతాపండితుని భార్య సంతోషించి వంటవండెను. వంటకములను

భుజించి వెళ్ళుమని ఆగొల్లను ఆమె పట్టుబట్టెను. కాని గొల్ల సమాధానము చెప్పెను. "నాకు భుజించు సామర్థ్యము లేదు. నానాలుకపై మూడుపుండ్లు పడియున్నవి. వానినుండి రక్తము స్రవించుచున్నది. అమ్మా! నేను వెళ్ళుచున్నాను."

గీతాపండితుని భార్య అడిగెను:—పండితులు వచ్చి అడిగినచో ఏమని చెప్పుదును?

గొల్ల జవాబు చెప్పెను:—"నాలుకయందు మూడుపుండ్లు ఉన్న మనుష్యుడు వచ్చి ఈస్వయంపాకమును ఇచ్చెనని చెప్పుడు.

గీతాపండితుడు ఏకాంతమున రోజంతయునుండి సాయంకాలము ఇంటికి వచ్చెను. అంతట ఇంటిలోనున్న మంచి ఆహారపదార్థములను చూచి విస్మయముతో నడిగెను. "ఇవి అన్నియును ఎక్కడి నుండి తెచ్చితివి?"

భార్య జవాబు చెప్పెను:-ఎవరో శేఠ్ యొక్క గొల్లయట. అతని నాలుకపై మూడుపుండ్లు కలవట. మీరు ఇంటినుండి బైటికి వెళ్ళినతరువాత తెచ్చి ఇచ్చెను. శ్రీకృష్ణపరమాత్ముడే ఈసామాను అంతయును తెచ్చిఇచ్చెనని తెలిసికొనుటకు ఆబ్రాహ్మణునకు ఆలస్యము అవలేదు. ఆయన భార్యతో నిట్లనెను:—

ఆతడు గొల్లకాడు. సాక్షాత్తు శ్రీకృష్ణపరమాత్ముడే వచ్చెను. నీవంటి పాపాత్మురాలికి దర్శనమిచ్చెను. కాని నేనుమాత్రము యథాప్రకారముగనే ఉన్నాను. అవి నాలుకమీద పుండ్లుకావు. నీగంటపు కొట్టివేతలు. ఇప్పుడైన తెలిసికొని పరమాత్మునిపై అచంచలమగు శ్రద్ధావిశ్వాసములను కలిగియుండుము. భవిష్యత్తునుగురించి చింతించక పోయినచో ప్రభువే తనంతట తాను తనభక్తులను రక్షించును.

## ఫకీరుని ఆస్తిక్యబుద్ధి.

ఈవిషయముననే మరియొక దృష్టాంతముకూడకలదు. తేపశ్శాలియగు 'శాహసుజా' పరమధార్మికరాలును యౌవనవతియును

అగు కన్యక ఒకర్తె ఉండెను. కేర్మాను దేశపు చక్రవర్తి ఆకన్యను తనకు పరిణయమాడనిమ్మని శాహాసుజాకు వర్తమానము పంపెను. "మూడురోజులలో సమాధానము చెప్పెదను" శాహాసుజా చెప్పెను. ఈమూడు రోజులలోను ఆతడు ఎన్నియో మసీదులు గాలించెను. మూడవరోజున అతడు మసీదులో ఒక యువకుడగు ఫకీరును కాంచెను. ఆతడు ఎంతయో భావయుక్తముగా నమాజు చదువుచుండెను. ఆతని నమాజు పూర్తిఅగువరకును అతడు అక్కడ నిలబడియుండెను. నమాజు పూర్తిఅయిన తదుపరి ఆఫకీరురును శాహాసుజా అడిగెను. "ఓయువకుడా! నీకు వివాహాము అయినదా?"

ఫకీరు:—"లేదండీ"

శా. స. :—"నీకు పెండ్లిచేసికొనవలెనను కోరిక కలదా?"

ఫకీరు:—నావంటి దరిద్రునకు ఎవడైన తనకుమార్తెనిచ్చునా? నాదగ్గర మూడు డబ్బులుకంటె మించిలేవు,

శా. సు. :—నాకుమార్తెను నీకుఇచ్చి పెండ్లిచేయుదును. ఆమూడుడబ్బులలోను ఒకడబ్బుతో సాంబ్రాణి, మరొకడబ్బుతో రొట్టె, ఇంకొకడబ్బుతో పటికబెల్లము కొనుక్కొనిరమ్ము.

ఈవిధముగా శాహాసుజా కొమార్తెవివాహాము ఆఫకీరుతో జరిగెను. ఎంత ఆశ్చర్యము, అపారమగు ధనముగల కేర్మానుచక్రవర్తి తనకుమార్తెను ఇచ్చి పెండ్లిచేయకుండ శాహాసుజా తనకుమార్తెను పరమానందముతో ఒకదైవభక్తుడును, ధ్యానపరాయణుడును అగు బీదఫకీరునకు ఇచ్చి వివాహాముచేసెను.

వివాహాము అయిననాటిరాత్రి ఆకన్య తనభర్తకుటీరములో అడుగుపెట్టెను. ఆమె కుటీరము నలుదెసల కలయచూచెను. ఒక మూల ఒకజలపాత్ర ఎండిన రొట్టెముక్క ఉండెను. "ఇది ఏమి" అని

కన్య అడిగెను. "ఈరొట్టి ఇక్కడ ఏల నుంచబడినది?" అని ఆమె ప్రశ్నించెను.

భర్త చెప్పెను:— "నేటిరాత్రి తినుటకు పనికివచ్చును అని తలచి నిన్న నిలువచేసితిని. ఈమాట వినినంతనే ఆమె నిస్పృహతో తనపుట్టింటికి వెళ్ళిపోవుటకు సిద్ధమయ్యెను. ఇది కాంచి ఫకీరు పలికెను. శాహసుజావంటి ధనవంతుని కుమార్తె నావంటి దరిద్రుడగు ఫకీరునకు సహధర్మచారిణి కాతగదు అనుసంగతి నేను మొదటినుండియు ఎరుగుదును."

యువతి పలికెను:— ప్రియతమా! నీనిర్ధనత్వమును తెలిసి కాని నేను పుట్టినింటికి వెళ్ళుచున్నానని అనుకొనకుము. నీప్రభుపరాయణత్వమునందలి లోపమునకు దుఃఖించి వెళ్ళిపోవుచున్నాను. "రేపు ఏమి తిందును" అను తలంపుతో నీవు ఈరొట్టెను నిలవచేసి యున్నావు. నీవు ఎంతనమ్మకములేనివాడవు! మాతండ్రిగారు నీ పైపైఆడంబరములు చూచియే నిన్ను ఎంచిరి అని నాకు తోచుచున్నది. ఇరువదిసంవత్సరములు నన్ను పెంచి పెద్దదానినిచేసి దేవునిపై పూర్తియగు ఆస్తిక్యబుద్ధికలవానికి ఇచ్చి పెండ్లిచేయుదునని చెప్పెను. కాని నీకు దేవుడు రొట్టె అయిన నిచ్చునను నమ్మకము లేదు.

ఇది విని ఫకీరు స్తబ్ధుడయ్యెను. ఎంతయో సిగ్గుపడి ఇట్లనెను:—

"ప్రియా! నాపాపమునకు ప్రాయశ్చిత్తము ఏమి?"

భార్య పలికెను:— "ఈఇంటిలో నేనైన నుండవలెను, లేక ఆరొట్టెముక్క అయినను ఉండవలెను."

ఫకీరు వెంటనే ఆరొట్టెముక్కను బైటికి విసరివేసెను,

"ప్రభుపరాయణుడగువాడు రేపు ఏమగునను చింతను కలిగి యుండడు" అనియే అన్నిమతములును చెప్పుచున్నవి. ఈవిషయము బైబిలునందుకూడ కానవగును.

## క్రీస్తు ఆస్తిక్య బుద్ధి.

మహాత్ముడగు క్రీస్తు బైబిలునందు ఒకచోట చెప్పెను:—

"నీవు నీజీవితమునుగురించి ఏమియు బాధపడుటలేదు. కావున ఏమి తినవలెను? ఏమి త్రాగవలెను? ఏమి ధరించవలెను? ఇట్టి విషయములను చింతించవలసిన అవసరములేదు. ఆహారాదులకంటె జీవితము ఎక్కువ విలువైనది గాదా? ఆకాశమునందు ఎగురు పక్షులను చూడుము. అవి ధాన్యమును నాటుటలేదు. కోయుటలేదు. నిలవ చేయుటలేదు. అయినను పరమాత్ముడు వానికి అన్నపానాదులను సమకూర్చుచునేయున్నాడు. పక్షులకంటెను నీవు గొప్పవాడవేకదా!

తోటలో పెరిగిన లిల్లీ అనుపుష్పమును చూడుము. అది ఎట్లు పెరిగినది? అది ఏమియును చేయుటలేదు. అయినను వాడిపోవుటలేదు. దేవునిపై నమ్మకములేనివారలారా! అదిగో చూడుడు. పరమాత్ముడు అడవిలోని గడ్డినికూడ రక్షించును. మిమ్ము రక్షించడా? కావున నేను ఏమి తినెదను? ఏమి ధరించెదను? మొదలగు ఆలోచనలను ఎప్పుడును కలిగియుండరాదు. (ఏలనన పాశ్చాత్యజనులు ఎల్లప్పుడును ఈ వస్తువులనుగురించియే బాధపడుచుందురు.) నీకు ఈ వస్తువులు అన్నియు కావలెనని పరమాత్మునకు తెలియును. ముందు నీవు ప్రభువుయొక్క రాజ్యమును ఆయనయొక్క సత్యప్రియత్వమును శోధించి తెలిసికొనుము. అప్పుడు ఈవస్తువులు అన్నియును వాటంతటవియే నీకు లభించును. కావున ఆలోచించవద్దు. 'రేపు' వచ్చినచో అదియే ఈవస్తువులన్నిటిని చూచుకొనును. నేటి అనర్థములన్నిటిని గురించియు నేడే ఆలోచించవలెను.

పరమాత్ముడు, సైతాను (అనగా మాయ) ఇరువురును ఒకే మారు భజించబడరు. సంక్షేపముగా చెప్పవలెననిన మీరు నాస్తికులే. అందుచేతనే మీకు పరమాత్మునిపై శ్రద్ధలేదు. అందుచేతనే రేపటిసంగతి ఆలోచించుచున్నారు."

పరమాత్ముడు, మాయ- ఈరెండును ఒకేమారు లభించవు. అను విషయమును గురించి కబీరుసాహెబుకూడ చెప్పెను:—

"ప్రభువుపై ప్రేమకలచోట ధనాదిమాయికపదార్థములపై ప్రేమఉండదు. ధనాది మాయిక పదార్థములపై ప్రేమ ఉన్నచోట ప్రభునిపై ప్రేమఉండదు. నిజమగు ప్రభుభక్తిఉన్నచోటనే వైరాగ్యముకూడ కనిపించును."

## సర్వాత్మభావవిచారము.

ఈవిధముగ మొదట విగ్రహముద్వారా నవవిధభక్తులను ఆచరించుచు విగ్రహగతుడగు పరమాత్ముడు స్థావరజంగమాత్మకమగు సర్వప్రాణులయందును వ్యాపకుడై యున్నాడని తెలిసికొని భక్తితో బాటు సర్వాత్మభావమునుకూడ చింతనచేయవలెను.

భాగవతమునందుకూడ భగవానుడు చెప్పెను:—

*మద్గుణశ్రుతిమాత్రేణ మయి సర్వగుహాశయే।*
*మనోగతిరవిచ్ఛిన్నా యథా గఙ్గాम्भసోఽమ్బుధౌ॥*
*లక్షణం భక్తియోగస్య నిర్గుణస్య హ్యుదాహృతమ్।*
*అహైతుక్యవ్యవహితా యా భక్తిః పురుషోత్తమే॥*

"నాగుణశ్రవణముతోబాటు, సర్వాంతర్యామినగు నాయందు సముద్రమునందు గంగాజలమువలె అవిచ్ఛిన్నముగా (మధ్యచెదరిపోకుండ) మనస్సు లగ్నమయి యుండవలెను అట్లుండుచు ఏవిధమగు ఫలమును కోరుటకాని, భేదభావమును కలిగియుండుటకాని కూడదు. ఇది పురుషోత్తముడగు పరమాత్మునిపట్ల నాచరించబడు నిర్గుణభక్తియోగముయొక్క లక్షణము."

పశువులు, పక్షులు, మనుష్యులు, కీటకములు, మిడుతలు మొదలగు ప్రాణులన్నిటియందును పరమాత్మనే చూడవలెను. పర

మాత్ముడు వేరువేరుస్వరూపములతో వేరువేరు ఆకారములచే తానే అన్నిటియందును ఉండును అనిభావించి ప్రభువును ధ్యానించవలెను. విగ్రహారాధనచేయువారు ఇతరులపట్ల చూపు రాగ ద్వేషములు యథార్థమగు భక్తికాదు. భగవానుడు చెప్పెను.

అహం సర్వేషు భూతేషు భూతాత్మావస్థితః సదా।
తదవజ్ఞాయ మాం మర్త్యః కురుతేఽర్చావిడమ్బనమ్॥

"సర్వాంతర్యామినగు నేను అన్నిప్రాణులయందును ఎల్లప్పుడును ఉందును. దానిని అవమానముచేయుచు విగ్రహారాధన చేయునాడు పూజను ఉపహసించుచున్నాడు."

యో మాం సర్వేషు భూతేషు సన్తమాత్మానమీశ్వరమ్।
హిత్వాఽర్చాం భజతే మౌఢ్యాత్ భస్మన్యేవ జుహోతి సః॥

"నేను సద్రూపమున అన్నిప్రాణులయందు ఉండు ఈశ్వరుడను. వానిని ఉపేక్షించి విగ్రహారాధన చేయుమూఢుడు బూడిదలో హోమము చేయుచున్నాడని తెలిసికొనవలెను."

పరమాత్ముడు సర్వవ్యాపకుడు అయినను కొందరు మందబుద్ధులు, అనగా మొద్దులు విగ్రహమునందే ప్రభుభావమునుగాంచి ఇతరులను ఉపేక్షించుదురు. అంతేకాదు. పంచాయతనదేవతలలో కూడ ఒకరిని ఆరాధించి మరియొకరిని ఉపేక్షించుదురు.

## భేదబుద్ధి మహాపాపము.

పంచాయతనమునందుకూడ భేదబుద్ధితో వ్యవహరించువారికి బ్రహ్మహత్యాపాతకము సంభవించునని దేవీభాగవతమున చెప్పబడినది.

శ్రీకృష్ణే చ తదర్చాయాం అన్యేషాం ప్రకృతౌ సతి।
శివే చ శివలిఙ్గే చ సూర్యే సూర్యమణౌ తథా॥
గణేశే వా తు దుర్గాయాం ఏవం సర్వత్ర సున్దరి।
యః కరోతి భేదబుద్ధిం బ్రహ్మహత్యాం లభేత్తు సః॥

"ఓసతీ! శ్రీకృష్ణునియందును, ఆతనివిగ్రహమునందును, ఇతర విగ్రహమునందును, శివునియందును, శివలింగమునందును, సూర్యుని యందును, సూర్యకాంతమణియందును, గణేశునియందును, దుర్గయం దును భేదభావమును పాటించువారు బ్రహ్మహత్యాపాతకమును పొందెదరు."

వేరువేరు దేవతలను పూజించుటచే రాగద్వేషములు కలుగు నను తలంపుతో శాస్త్రములయందు పంచాయతనపూజను ప్రతిపా దించిరి. అందు ఒకరు ముఖ్యులు, మిగిలిన నలుగురును గౌణులు. 1. విష్ణుపంచాయతనము 2. శివపంచాయతనము 3. దేవీపంచాయత నము 4. సూర్యపంచాయతనము 5. గణేశపంచాయతనము అను ఈ 5 పంచాయతనములును ముఖ్యమైనవిగా గ్రహించబడినవి. రాగ ద్వేషములు కలుగకుండుటకు ఈఏర్పాటును శ్రీశంకరభగవత్పా దులుకూడ స్వీకరించిరి. ఇది స్మార్త ఉపాసన అని చెప్పబడును. అయినను తెలివితక్కువతనముచే అజ్ఞానులు దేవతలయందు భేదభా వమును కలిగియుందురు.

## అర్థములేని మతభేదములు.

శైవ, వైష్ణవాది మతమతాంతరములు అన్నియు గుడ్డివాళ్ళ దృష్టాంతమును పోలినవి.

ఒకప్పుడు 5గురు గుడ్డివారు కలసి ఏనుగునుచూచుటకు వెళ్ళిరి. ఒకడు ఏనుగును తీసికొనివచ్చి వారిఎదుట నిలబెట్టెను. ఒక గుడ్డివాడు తనచేతితో ఏనుగచెవిని ముట్టుకొనెను. రెండవవాడు కాలుముట్టుకొనెను. మూడవవాడు తొండమును స్పృశించెను. నాలు గవవాడు తోకను పట్టుకొనెను. 5వవాడిచేతికి ఏనుగుకడుపు తగిలెను. అంతట చెవి చేతికితగిలిన మొదటిగుడ్డివాడు ఇట్లనెను:— చాలరోజుల నుండి ఏనుగును చూడవలెనను కోరికయుండెను. అది నేడుసఫల

మయ్యెను. ఏనుగు సరిగా చేటవలెనున్నది. కాలుపట్టుకొన్న రెండవ వాడు పలికెను. లేదు సోదరా, లేదు. ఏనుగు సరిగ స్తంభమువలె నున్నది. తొండము అందిన మూడవవాడు చెప్పెను. మీరు ఇరువురును మూర్ఖులు. ఏనుగ కొండచిలువవలెనున్నది. తరువాత తోకను ముట్టుకొనిన నాలుగవవాడు ఇట్లనెను:— మీరు చెప్పినమాటలన్నియును తప్పులే. ఏనుగ త్రాడువలెనున్నది. ఇక ౫వవాడు వారిని మందలించుచు ఇట్లుపలికెను:—

"అరే, మీఅందరికి నేడు మతిస్తిమితము పోయినదావేమి? ఎందుకు అట్లుపేలుచున్నారు? ఏనుగు సరిగా పీపావలె నున్నది.

ఈవిధముగా వారు తమచేతికి అందిన అవయవమును ఆధారముగా చేసికొని ఏనుగరూపమును మనస్సునందు ఊహించుకొని తమ అభిప్రాయమే నిజమనుకొని జగడము ప్రారంభించిరి. ఆజగడము అంతకంతకు పెరిగి తిట్లుతిట్టుకొనుటనుండి కొట్టుకొనుటవరకు పెరిగెను. ఇదిచూచి ఇరుగుపొరుగున ఉన్నవారు ఆశ్చర్యముతో వారిమూర్ఖత్వమునకు నవ్వుకొనిరి.

యథార్థమునకు వారిలో ఎవ్వరును ఏనుగుయొక్క నిజస్వరూపమును తెలిసికొనలేకపోయిరి. ఇటులనే శైవ, వైష్ణవాది వివిధమతస్థులుకూడ అంధహస్తిన్యాయమున కొట్లాడుచున్నారు.

నేడు వైష్ణవులకును, శైవులకును ఒకరనిన మరియొకరికి కిట్టదు.

'హస్తినా తాడ్యమానోఽపి న గచ్ఛేత్ శైవమన్దిరమ్ ।

మతిచెడిన ఏనుగు వచ్చి త్రొక్కివేయుటకు సిద్ధముగానున్నను "ప్రక్కనఉన్న శివాలయములోనికి వెళ్ళరాదు.ఏనుగుకాలిక్రింద పడిపోయి చచ్చిపోవుట మంచిది అని వైష్ణవులు చెప్పెదరు.''

అటులనే ఈశ్లోకమునందలి శబ్దములను క్రొంచెముమార్చి శైవులుకూడ ఇట్లు అనెదరు,

హస్తినా తాడ్యమానోఽపి న గచ్ఛేత్ విష్ణుమన్దిరమ్ ।

"ఏనుగు నిన్ను చంపుటకు వచ్చుచున్నను విష్ణ్వాలయమునకు వెళ్ళరాదు."

ఇట్లు శైవమతస్థులు విష్ణువును నిందించెదరు. అటులనే అమ తమువారిని ఎంతయో అవమానించెదరు.

ఈమతానుయాయువులు, కర్ణాటకమునందును, త్రిలింగదేశము నందును లింగాయతులు, జంగములు అనువారలయందు ఉన్నారు. అచ్చటి కొందరుబ్రాహ్మణులు తాము శైవులమందురు. కాని వారు శంకరాచార్యులవారి అద్వైతమతావలంబులును, పంచాయతనోపాస కులునుకూడను. శివుని, విష్ణువుని ఆధారముగ తీసికొని మతభేద ములు ఉంటే ఉండుగాక, కాని ఒకే విష్ణువుయొక్క అవతారములు రామ, కృష్ణాదులు పది ఉన్నవికదా! వారియందుకూడ తెలివితక్కు వచే ద్వేషభావము కానవచ్చుచున్నది.

నాకు ఇద్దరుమిత్రులు ఉండిరి. వారిలో ఒకడు అనన్యరామ భక్తుడు. రోజును రామాయణము చదివి శ్రీరామచంద్రుని విగ్ర హమును పూజించెడివాడు. రెండవవాడు కృష్ణోపాసకుడు. అతడు గీతాధ్యయనముచేసి కృష్ణవిగ్రహమును పూజించెడివాడు. ఒకనాటి ప్రసంగమున కృష్ణభక్తుడు పలికెను– శ్రీకృష్ణుడు విష్ణుభగవానుని పదహారుకళలతోను నిండిన అవతారము. ఆయన పూర్ణపురుషోత్త ముడు. శ్రీరామచంద్రుడు విష్ణుభగవానుని 12 కళలను మాత్రమే కలిగియున్నాడు. కావున ఆయన పూర్ణపురుషోత్తముడు కాడు.

అంతట రామభక్తుడు చెప్పెను :– శ్రీకృష్ణుడు పూర్ణపురుషో త్తముడు అయి ఉండవచ్చును. అయినను ఆయన చరిత్రహీనుడు. శ్రీరామచంద్రుడు ఏకపత్నీవ్రతస్థుడు. ఒకటేమాట. ఒకటే బాణము మొదలగు నియమములను పాటించువాడు. ఆయన ఉత్త ముడు. ఈవిధముగా వారిలో పరస్పరమూ ద్వేషము పెరిగెను. ఒకరి

ముఖము మరియొకరు చూచుటకూడ మానివేసిరి. ఈవిషయముననే ఒకదృష్టాంతమును గమనించుడు.

ఒకగ్రామమునందు ఒకస్వామివారి మఠము ఉండెను. వారికి ఇద్దరు శిష్యులు ఉండిరి. ఒకసారి వైశాఖమాసమున మిక్కుటమగు ఎండలు కాయుచుండెను. ఆరోజులలో ఒకనాటిరాత్రి గురువుగారు డాబాపై పరుండియుండిరి. శిష్యులు ఇరువురును ఆయనపాదములు పట్టుచుండిరి. ఇరువురు శిష్యులును వారిసేవలను పంచుకొనియుండిరి. పెద్దశిష్యుడు ఎడమకాలు పట్టుచుండెను. చిన్నశిష్యుడు కుడికాలు పట్టుచుండెను. ఇరువురు శిష్యులును పరస్పరము ద్వేషముతో జ్వలించుచుండిరి.

ఆసమయమున గురువుగారికి దాహమువేసి చిన్నశిష్యుని దాహము ఇయ్యమని అడిగెను. ఆతడు కాలుపట్టుట మానివేసి నీరు తీసికొనివచ్చుటకు క్రిందకు వెళ్ళెను. అంతట పెద్దశిష్యుడు ఇట్లు ఆలోచించెను. "చిన్నశిష్యుడు లేనిసమయమున ఆతనికాలును రెండు మూడుసార్లు గట్టిగా గిల్లివేయుట మంచిది." ఇట్లు తలచి గురువుగారి కుడికాలుపై గట్టిగా రెండుమూడు గిల్లులు గిల్లెను. గురువుగారు ఓరీ; మూర్ఖుడా! ఇదేమి? ఇట్టిపని చేయుచున్నావు? అని బాధతో పలికిరి. ఇంతలో గురువుగారికి నీళ్ళు తీసికొనివచ్చిన చిన్నశిష్యుడు ఆయన బాధపడుచుండుట చూచి ఇది ఏమి? అని అడిగెను. ఈమూర్ఖుడు గట్టిగా గిల్లెనని గురువుగారు చెప్పిరి.

ఈమాటలు విని చిన్నశిష్యుడు పలికెను:— "ఇతడు నాకాలుపై గిల్లెను. నేను ఇతని కాలును విరుగగొట్టి కుంటిదానిని చేసివేయుదును." ఇట్లని దుడ్డుకర్ర తీసికొనివచ్చి గురువుగారి ఎడమకాలుపై గట్టిగా రెండు మూడు దెబ్బలువేసెను. దానితో గురువుగారి కాలు విరిగిపోయెను. ఉదయము సేవకులు వచ్చి గురువుగారిని ప్రశ్నించిరి. స్వామీ! ఇదేమి కర్మము?

గురువుగారు ఇట్లు సమాధానము చెప్పిరి:– ఈమూరుల్లు ఇరువురును పోట్లాడుకొని నాకాలు విరుగకొట్టిరి. వీరిరువురను వెళ్ళకొట్టుడు.

(ఇది విని అందరును నవ్విరి.)

అజ్ఞానవశమున ఇట్టి విపరీతములు జరుగును.

ఈవిధముగా తమోగుణ, రజోగుణ యుక్తమగు బుద్ధికలవారల యందు జడత్వము కానవగును. కావున బుద్ధిని ఉపయోగించి సత్వ ప్రధానమగు బుద్ధితో వస్తువును వస్తురూపమున గ్రహించి ఉపాసించవలెను. మీరు మొదట పంచాయతనమును పూజించుడు. అనంతరము మాయావిశిష్టుడగు ఈశ్వరుని– అనగా సగుణబ్రహ్మమును ఉపాసించుడు. తరువాత నిర్గుణబ్రహ్మమును ఉపాసించుడు.

వేదమునందు ఉపాసనాశబ్దమును, పురాణములయందు భక్తి శబ్దమును ఉపయోగించబడినవి. ఈరెంటికిని ఎక్కువ భేదము లేదు. భక్తి అనగా ప్రేమ. ఉపాసన అనగా సమీపమున కూర్చుండుట. అనగా ప్రభునిసాన్నిధ్యమును పొందుట.

ఈవిధముగా వేదశాస్త్రములయందును, ఆచార్యోపదేశముల యందును మలదోషనివృత్తికొరకు నిష్కామకర్మమును, విక్షేపదోష నివృత్తికొరకు ఉపాసన లేక భక్తియును ముముక్షువులకు నిర్దేశించబడినవి.

అంతట దామజీభాయి ప్రశ్నించెను:–

"ఇంకను నామనస్సు భక్తిమార్గమున దృఢముగా సంచరించుట లేదు. క్షణములో మాయావిషయములయందు మనస్సు ప్రవర్తించును. ఇక భక్తి ఎట్లు వృద్ధిని పొందును?"

స్వా. ప్ర. :— భాగవతమున చెప్పబడినది:–

*భక్తిః పరేశానుభవో విరక్తిరన్యత్ర చైవ త్రిక ఏకకాలః।*
*ప్రపద్యమానస్య యథాశ్నతః స్యుః తుష్టిః పుష్టిః క్షుదపాయోఽనుఘాసమ్॥*

"భోజనముచేయు మానవునకు ప్రీతిముద్దకును సంతోషమును పుష్టియును కలిగి ఆకలితీరును. అటులనే ప్రభువును శరణుజొచ్చిన వానికి భక్తి ప్రభువుయొక్క అనుభవము, విరక్తి మూడును ఒకేసమయమున కలుగును."

ఈశ్లోకము ఒకమామూలు దృష్టాంతముచే తెలియనగును.

ఒకానొక దరిద్రుడు ఉన్నాడనుకొనుడు. ఆతనికి ఉండుటకు ఒకచిన్నకుటీరము ఉన్నది. ధరించుటకు చినిగినబట్టలు, తినుటకు ఎండిన రొట్టెలు దొరకుచున్నవి. ఇట్టివానికి ఏవ్యాపారమునందో నెమ్మదిగా రెండుమూడువేలరూపాయలు దొరకిన తనకుటీరమును విడచి మంచిఇంటిలో నివసించుట మొదలుపెట్టును. మంచిభోజనము భుజించును. తనకు లభించినద్రవ్యముతో కొంచెముకొంచెముగా వ్యాపారము మొదలుపెట్టి అంతకంతకు వృద్ధిచేసికొనుచు లక్షాధికారియు, కోటీశ్వరుడును అయిపోవును. డబ్బుపెరిగినకొలదియు బండ్లు, వాహనములు, నౌకరులు, చాకరులు మొదలగునవి అన్నియును వరుసగా వృద్ధిపొందిపోవును. ఈవిధముగా ఆతడు ఐశ్వర్యమును పొందినకొలదియు ఆతని పురాతనకుటీరము, చినిగినవస్త్రములు, ఎండినరొట్టెలు మొదలగునవి పూర్తిగాపోవును. అటులనే ప్రభువును శరణుజొచ్చిన వానికి మొదట భక్తియు, తరువాత ఆతనిశరీరమునందు భగవదనుభవములును వృద్ధిపొందుచుండును. ప్రభువుయొక్క ఆనందస్వరూపమును ఎక్కువగా అనుభవించినకొలదియు ఆతనికి జగమునందలి మోహాకపదార్థములపట్ల విరక్తి కలుగును. ఈవిషయమున భాగవతమున చెప్పబడినది:—

*న పారమేష్ఠ్యం న మహేన్ద్రధిష్ణ్యం నసార్వభౌమం న రసాధిపత్యమ్,*
*న యోగసిద్ధీరపునర్భవం వా మయ్యర్పితాత్మేచ్ఛతి మద్వినాన్యత్॥*

"భగవద్భక్తితో భగవదనుభవములను పొందుసత్పురుషులు నిరంతరము విరక్తులుగనేయుందురు. వారికి బ్రహ్మసుఖమునందుకూడ

కోరికయుండదు. ఇంద్రవైభవమునందుకూడ ప్రేమ కలుగదు. అటులనే సార్వభౌమత్వము, సర్వరసాధిపత్యము, యోగసిద్ధి, మోక్షము- వీనిలో దేనినికూడ కోరరు. నాయందు తనమనస్సును అర్పించినవాడు ఆమనస్సుతో నేనుతప్ప (భగవానుడుతప్ప) మరియొకపదార్థమును దేనినికూడ కోరడు."

ఈవిషయమున భక్తవరుడగు తుకారాముని దృష్టాంతము కలదు.

తుకారాము మొదట మంచి స్థితిగతులుకలవాడే. కాని భక్తహృదయమును పొందుటచే దుఃఖితుని ఎవనినైన చూచిన దయతో ఆతనికి ధనాదిపదార్థములను ఇచ్చెడివాడు. ఇట్లు ధనాదులను వ్యయముచేయుచు తుకారము తనజీవితమును సామాన్యవ్యక్తి జీవితమువలె గడపెడివాడు. ఈవిషయము శివాజీమహారాజుకు తెలిసెను. ఆయన తనమంత్రిని పిలిచి తుకారాముకు ధనము, వస్త్రాలంకారములు మొదలగునవి పంపమని చెప్పెను, మహారాజునాజ్ఞను అనుసరించి మంత్రి నౌకరులచే అన్నివస్తువులను తుకారాముఇంటికి తీసికొనివెళ్ళిరి. ఆసమయమున తుకారాము తనఇంటలేకుండెను. అందుచే ఆయనభార్య "కొంచెముసేపు కూర్చొనుడు. వారు బైటికి వెళ్ళిరి. ఇప్పుడే వచ్చెదరు" అని చెప్పెను.

మంత్రి చెప్పెను:- ఈవస్తువులను అన్నిటిని శివాజీమహారాజు కానుకగా పంపెను. తమరు తీసికొనుడు. తుకారాముభార్య పట్టరానిసంతోషముతో ఆవస్తువులను అన్నిటిని ఇంటిలో నుంచుకొనెను. ఇంతలో తుకారాము వచ్చి మంత్రికి నమస్కరించి ఇట్లనెను:-

"తమరుగొప్పవారు. మాయింటికివచ్చుటకు కారణముఏమి?"

మంత్రి సమాధానము చెప్పెను:- "శివాజీమహారాజు కానుకగా పంపినవస్తువులను ఇచ్చుటకు వచ్చితిని."

ఇది విని తుకారాము వ్యాకులహృదయముతో పలికెను:-

"దయయుంచి తమరు తీసికొనివచ్చిన వస్తువులు వెనుకకు తీసికొనిపొండు. వీనిని తీసికొనుట మాధర్మము కాదు."

మంత్రి వారికి ఎంత తెలియజెప్పినను ఆయన ఏమియు ఉంచుకొనలేదు. నిరుపాయుడై మంత్రి ఆవస్తువులను అన్నిటిని వెనుకకు తీసికొనిపోయెను. శివాజీమహారాజుకు ఈసంగతి తెలిపెను.

తరువాతిరోజున శివాజీ మంత్రిని పిలచి చెప్పెను:—

"తుకారాముగారిని తీసికొనివచ్చుటకు నేను నీకు ఒకఆహ్వానపత్రమును ఇచ్చుచున్నాను. దీనిని తీసికొనవెళ్ళుము. ఈ పాలకీని, గుర్రపురౌతులను వెంటబెట్టుకొని వెళ్ళి వారిని తీసికొనిరమ్ము."

ఆవిధముగా మంత్రి తుకారామును తీసికొనివచ్చుటకు వెళ్లెను. ఆయన తుకారాముని మహారాజువద్దకు దయచేయుమని ప్రార్థించెను. తుకారాము ఇట్లు సమాధానము చెప్పెను:- ఈవిధముగు అధికారాడంబరములచే నాకు సంతోషమునకుబదులుగా కష్టము కలుగును."

ఆయన వ్యాకులత్వముతో విట్ఠలనాధునిసంబోధించుచుపలికెను.

*దివట్యా ఛత్రీ ఘోడే హేతో బర్యాత నా పడే*
*ఆతాం యే యే పండరీరాయా మన గోవనీ కాసయా॥*
*మాన దమ్భ, చేష్టా హేతో సుకరాచీ విష్టా*
*తుకా హ్మణే దేవా మాంఝే సోడవణే ధావా॥*

"కాగడా, ఛత్రము, గుర్రములు – మొదలగువానిని ధనవంతుడుగానున్న రోజులలోకూడ నేను ఉపయోగించలేదు. ఓవిట్ఠలనాథుడా! ఇప్పుడు ఏల నన్ను వైభవమున చిక్కుపరచుచున్నావు? గౌరవము, దంభము, చేష్టలు- ఇవి పందిమలమువంటివి. (తుకారాము చెప్పుచున్నాడు) పరుగెత్తుకొనిరమ్ము. నన్ను వీనినుండి విడిపింపుము" అని పలికి వచ్చినవారికి నచ్చచెప్పెను. శివాజీకి ఉత్తరము ద్వారా ఇట్లు తెలియపరచెను:—

"నేను ఉదాసీనావస్థలోనున్న అరణ్యవాసిని. దుమ్ముతోనిండిన శరీరము, అమంగళమగు వేషము. ఏది దొరకిన అది తినువాడను. రూపవిహీనుడను. ఇట్టివానిని దర్శించుటచే ఏమిలాభము కలుగును? నావంటివాడు సదా పాండురంగని శరణునందు వాంఛారహితుడయి ఆనందమున సంచరించుచుండవలెను."

తరువాతరోజున శివాజీ స్వయముగా కానుకలను అన్నిటిని తీసికొని వచ్చెను. తుకారాము నవ్వి ఇట్లు పలికెను- తండ్రియగు విఠ్ఠలనాథునకు ఉన్నది అంతయును నాదియే. అందువేతనే నామనస్సు సంతోషించుచున్నది. మీరు తెచ్చిన మృదూ)షములు గు కాంచన మౌక్తికాదులు మాయ. వానిని నేను ఏమిచేయుదును? నాధనము త్రిభువనవైభవము. మీకుకూడ అట్టిసుఖము కావలెనను కోరిక యున్నచో విట్ఠలుని శరణు అత్యంతసులభసాధనము. పురుగు, రాజు రెండును నాదృష్టిలో సమానమగు ప్రాణులే. మోహము, ఆశ- ఈ రెండును కలికాలపు ఉరితాళ్ళు. వాటికి ఇచ్చట తావులేదు. స్వర్ణము, మట్టి-రెండును సమానమే. (తుకారాము చెప్పెను. "వైకుంఠము అంతయును ఇంటియందు కూర్చొనియుండగనే వచ్చినది. ఇక నాకు ఏవిషయమున లోటు కలదు?"

అనంతరము శివాజీ తరచు తుకారాముయొక్క సత్సంగలాభమును పొందెను. ఇట్లు చాలకాలమైనపిమ్మట ఒకమారు శివాజీ ఒక లక్ష ఇరువదిఅయిదువేలమంది బ్రాహ్మణులను సమావేశపరచెను. ఆసమయముననే సంతుల సమావేశమునుకూడ ఏర్పాటుచేసెను. ఆసమావేశమున తుకారాము భజనలో జనసమూహముఅంతయు లీనమైపోయెను. తుకారాముయొక్క ఈమహిమను గాంచి శివాజీ విస్మితుడయి ఆయనకు నాలుగుగ్రామములు అర్పించుచు తామ్రశాసనమును తయారుచేయించెను. బ్రాహ్మణులందరకును తగినదక్షిణలు ఇచ్చి

సాగనంపునసమయమున తనకుకూడ ఏదియో ఇచ్చునని తుకారాముకు తోచెను. ఆయన చల్లగా వెళ్ళిపోయెను. శివాజీ రామదాసుస్వామి గారివద్దకు వెళ్ళి ఎంతయో విచారముతో ఈవిషయమును వెల్లడించెను. ఆయన శివాజీకి ఇట్లు సమాధానము చెప్పెను:— "సంతులు మూడులోకముల సామ్రాజ్యమునుకూడ తుచ్ఛముగా తలచెదరు; వారికి నీనాలుగుగ్రామములనిన లెక్కఏమి?"

హిరణ్యకశిపుని వధించినపిదప భగవానుడు ప్రహ్లాదుని వరమును కోరుకొనమని చెప్పగా ప్రహ్లాదుడు ఇట్లన్నట్లు భాగవతమున 7వ స్కంధమున చెప్పబడినది:—

*మా మాం ప్రలోభయోత్పత్త్యాసక్తం కామేషు తైర్వరైః।*
*తత్సఙ్గభీతో నిర్విణ్ణో ముముక్షుస్త్వాముపాశ్రితః॥*

"ఓప్రభూ, నేను పుట్టుకచేతనే విషయాసక్తుడను. ఇప్పుడు వరమిచ్చెదను అను లోభమును చూపించి నాకు ఇంకా దురాశ కలిగించకుడు. విషయాసక్తియందలిభీతిచే నేను వానిని త్యజించి ముముక్షువునయి తమశరణుకు వచ్చితిని."

ఇదేవిధముగ భగవానుడు సాక్షాత్కరించి, వరములను కోరమని చెప్పినపుడు ధ్రువుడుకూడ చెప్పెను:—

*స్థానాభిలాషీ తపసి స్థితోఽహం త్వాం ప్రాప్తవాన్దేవ మునీన్ద్రగుహ్యామ్।*
*కాచం విచిన్వన్నపి దివ్యరత్నం స్వామిన్ కృతార్థోఽస్మి వరం న యాచే॥*

"ఓభగవానుడా! నేను రాజ్యమును పొందుటకే ఇంతవరకు తమకొరకు తపము చేసితిని. కాని ఇప్పుడు నాకు యోగులకును, మునులకును దుర్లభమగు సచ్చిదానందస్వరూపము లభించినది. గాజుముక్కను వెతుకువానికి దివ్యమణి లభ్యమైనచో నాతడు ఇంకను గాజుముక్కను వెతుకునా? ఓనాథా! ఇప్పుడు నాకు ఏవరమును అక్కరలేదు. నేను తమదర్శనముచేతనే కృతార్థుడను అయితిని."

ఈవిషయమున భాగవతమున భగవానుడుకూడ చెప్పెను:—

మత్సేవయా ప్రతీతం చ సాలోక్యాది చతుష్టయమ్ ।
నేచ్ఛన్తి సేవయా పూర్ణాః కుతోఽన్యత్కాలవిద్రుతమ్ ॥

"నాసేవచే నాభక్తులకు సాలోక్య, సారూప్య, సామీప్య, సాయుజ్యములనబడు నాలుగురకములగు ముక్తులను పొందవలెనని కూడ కోరిక యుండదు. సేవచే పూర్ణత్వమును పొందవలెనను కోరికకూడ ఉండదు. ఇక వారు కాల, దిశావరిచ్ఛిన్నములగు భోగ విలాసములను కోరునా? అనగా కోరనే కోరరు."

## బుద్ధిమంతుడగు ధర్మాత్మునికి ధనము ఉన్నచో శుభగుణములు వికసించును.

దామడీభాయి:— నవవిధభక్తులలోను ఒకటియగు ఆత్మనివేదనమునందు ప్రభువునకు శరీరము, మనస్సు, ధనము— వీనిని అర్పించవలెనని తెలుపబడినది. తనకొరకు ఏమియును నిలువచేయరాదు అని ఆదేశించబడినది. కాని నీతితో ధనము సంపాదించి ఆసంపాదనతో రోజుగడుపుకొనుచు, కొద్దియో, గొప్పయో మిగిలినచో దానిని బీదలకు ఇచ్చినచో తప్పేమి?

స్వా. ప్ర. :— ఆత్మనివేదనమును గురించి చెప్పబడిన "నిర్వాహాయ చ శూన్యత్వమ్" అనునది పూర్ణవైరాగ్యవంతునిగురించి మాత్రమే. మందవైరాగ్యవంతుడు నీతిగా ధనమును సంపాదించుకొని, దానిని సన్మార్గమున ఉపయోగించుకొనినచో అందు తప్పు ఏమియును లేదు. ఈవిషయమున పారసభాగమున వ్రాయబడినది:—

ధనము నింద్యము అయినను దానియందు శుభగుణములు కలవు. బుద్ధిమంతునియొద్ద కాని, ధర్మాత్మునియొద్దకాని ధనము ఉన్నచో ఆసద్గుణములు వికసించును. గర్భదరిద్రుడు దైవవిముఖుడగును. అందు సందేహములేదు. ఏలనన తనకుటుంబీకుల ఆకలిచే

ఆతనిచిత్తము వికలమగును. భగవానుడు ఆతనికి అన్యాయముచేయు నట్లు తోచును.

సర్పమువద్ద విషమును, మణియును రెండును ఉండును. అటులనే ధనమునందు గుణమును దోషమును రెండును ఉండును.

ధర్మమార్గమున ఉండువానికి ధనముచే మూడురకములగు లాభములు కలుగును:- 1. నీతిగా సంపాదించబడిన ధనము పరిశుద్ధ మగు వృత్తిచే సంపాదించబడినదగుటచే మానవుని నిశ్చింతుని చేయును. 2. సాత్త్వికపురుషులకును, కుటుంబీకులకును, యాచకులకును, సేవ కులకును ధనముచే సంతోషముకలిగించి పుణ్యమును సంపాదించ వచ్చును. 3. ధనముచే నూతులు, బావులు, చెరువులు, మార్గములు, వంతెనలు, ధర్మసత్రములు, దేవాలయములు నిర్మించుట మొదలగు పరోపకారకార్యములు చేయవీలుపడును.

## ఔదార్యముచే కలుగు లాభములు,

పారసభాగమునందు ఇంకను ఇట్లున్నది:—

పరమపదము జపముచేతను, తపముచేతను, వ్రతముచేతను లభించదు. అది పరిశుద్ధమగు హృదయముచేతను, దయ, ఔదా ర్యము—వీనిచేతను పొందనగును.

అలీ అను సంతు చెప్పెను:— నీకు సంపదకలిగిన దానిని ఔదార్యముగా ఖర్చుచేయుము. దానముచే సంపద తగ్గదు, పెరిగిపో వును. ఎట్లనిన:—

ఒకవ్యక్తి తనమనోరథమును కాగితముపై వ్రాసి హసను అను సంతునివద్దకు వచ్చెను. హసను ఆకాగితమును చదువకుండ నిట్లనెను. "నీకు కావలిసినది అడిగి తీసికొనుము. అంతట ఒకడు ఆయనను ప్రశ్నించెను:- "మీరు కాగితము ఏల చదువలేదు?"

ఆయన జవాబు చెప్పెను:— "నేను ఆలస్యముచేసినచో ఆ యాచకుని కోరికలను తీర్చుటలో విలంబము ఎందుకుచేసితివి?" అని

భగవానుడు అడుగును. అప్పుడు నేను ఏమి సమాధానము చెప్పగలను?

ధనముచే అతిథి, అభ్యాగతులను సేవించుభాగ్యము లభించును. అది ఏమియు తక్కువలాభముకాదు. ఒకప్పుడు అలీసంతు ఏడ్చుచుండెను. "మీరు ఎందుకు ఏడ్చుచున్నారని" ఒకడు ఆతనిని అడిగెను. అలీ జవాబు చెప్పెను:— నేను ఎంతో దురదృష్టవంతుడను. ఏడురోజులనుండి నాఇంటికి అభ్యాగతుడు ఎవడును రాలేదు. అందుచే నేను ఏడ్చుచున్నాను."

తనకోర్కెలు ఈడేరుటకు అవసరమగు ధనమునుకూడ ఖర్చు చేయకుండ తనకోరికలను తీర్చుభారము ఇతరులపైనుంచి, ధనమును దాచుకొనువాడు పిసినిగొట్టువాడు. తాను కోరుదానిని ఒకయాచకునకు భగవదర్పితముగా సమర్పించినచో యథార్థమగు ఔదార్యముగా పరిగణించబడును.

ఒకభక్తుడు మాయను (సైతానును) ప్రశ్నించెను:—

"నీకు ప్రియమైనవాడు ఎవడు?"

సైతాను సమాధానము చెప్పెను:—"పిసినిగొట్టువాడు నాకు ఎంతయో ఇష్టుడు. ఆతడు తపస్సు, పరిశ్రమ చేసి ఎంతయో కష్టించును. అయినను లుబ్ధత్వముచే నాతనిఫలము నశించును. రజోగుణము కలవాడైనను ఉదారుడైన ఆతడు నాశత్రువు. ఆతడు ఐహికసుఖములను అనుభవించును. అయినను ఆతని ఔదార్యముచే భగవానుడు ఆతని అపరాధములను క్షమించును. ప్రభువుయొక్క దయచే నాతనికి వైరాగ్యము కలుగును అని నాకుభయము." కావున ఎల్లప్పుడు ఔదార్యమును కలిగియుండుట యుక్తము.

మహాత్ముడగు మూసాకు ఆకాశవాణి వినవచ్చెను:— "ఎవడైనను తనజీవితమంతటియందును ఒకమారైనను స్వార్థమును విడనాడి

పరునికొరకు పాటుపడినచో ఆతడు నాకు అత్యంతసంతోషమును కలుగజేయును.''

బళరుషాఫీ అను సంతు మహోదారుడు. ఆతడు కాలము చేయు సమయము సమీపించెను. ఆసమయమున ఒకయాచకుడు సమీపించి ప్రార్థించెను. అప్పుడు ఆతనివద్ద ఏమియును లేదు. ఆకారణముచే తాను కట్టుకొనిన బట్టవిప్పి ఆతనికి ఇచ్చెను. తరువాత నొక ముహూర్తములో నాతనిప్రాణము పోయెను. ఆసమయమున ఒకబుద్ధిమంతుడు పలికెను:— "బళరుషాఫీ నగ్నముగావే ఇచ్చుటకువచ్చి నగ్నముగానే పరలోకమునకు వెళ్లెను.

## కృపణత్వమునకు కారణములు, వానిని పోగొట్టు నుపాయములు.

భోగాసక్తి, చాలకాలము జీవించవలెనను కోరిక, పుత్రులపై మోహము— కృపణత్వమునకు కారణములు. అవి పోగొట్టుటకు పురుషుడు సంతోషముగా జీవితమును గడపవలెను. ఎట్టికష్టములనైనను సహించుటకు అభ్యసించవలెను.

"మానవజీవితమును నమ్మవలసిన పనిఏమి? బలిష్ఠమగు శరీరముకలవాడుకూడ ఒకసముమములో శరీరమును విడచివెళ్ళిపోవును. ఒకనావంటి దుర్బలుని సంగతి ఏమి చెప్పవలెను? కుమారులు తమ ప్రారబ్ధమునుకూడ తీసికొనియే వచ్చిరి. తండ్రి అమితమగు సంపదను ఇచ్చినను కుమారులు దానిని వ్యయముచేసిన ఉదాహరణలును, తండ్రి నిర్ధనుడైనను కుమారులు ధనవంతులైన దృష్టాంతములును లేక పోలేదు.'' అని తలచి పిసినిగొట్టుతనమును విడనాడి తనధనమును పరోపకారముకొరకు ఉపయోగించి, ధర్మమును ఆచరించవలెను. ధనము దానముచేయనిదే పిసినిగొట్టుతనము పోదు. ప్రియునకు

దూరముకానిదే, ఆతనియందలి మోహము పోదుకదా! అటులనే ఇదికూడ.

## ధనము అను సర్పమును ఆడించుటకు 5 మంత్రములు

ధర్మకార్యములు చేయుటకుకూడ ధనము సంపాదించవలె ననునది మరువరాదు. దానిచే మదము, మోహము అను విషము ఎక్కరాదు. పాములవానికి సర్పవిద్య తెలియును. కావున ఆతనికి సర్పము ఏమాత్రమును హానికలిగించలేదు. ఇతరుడెవడైన పాముతో ఆడుకొనుట తనమృత్యువుతో ఆడుకొనుటయే. అటులనే ధనముసంగతికూడ. ధనము అను సర్పమును పెంచుటకు ఈ 5 మంత్రములను నేర్చుకొనవలెను:—

1. శరీరనిర్వహణార్థమే ధనమును సంపాదించవలెను. శరీరము ఇంద్రియములకు నివాసస్థానము. ఇంద్రియములు బుద్ధియొక్క నౌకరులు. బుద్ధియొక్కపని భగవానుని పరిచయముచేయుట. ఇది సరిగా తెలిసికొని అందుకు తగుధనమును దగ్గరనుంచుకొనుము.

2. పాపముచేయకుండ నిష్కపటముగా ధనమును సంపాదించవలెను.

3. శరీరకార్యమునకు మించిన ధనమును సంపాదించరాదు. అందుకూడ ఔదార్యముగా తగినంత దానముచేయబడునట్లు చూడుము.

4. జీవితము సంయమముతో గడపుము. ధనమును భోగములలో ఖర్చుపెట్టకుము.

5. చిత్తవృత్తులను ఎల్లప్పుడును ధర్మమార్గమున జాగ్రత్తగ నుంచుము,

ఈ 5 మంత్రములను సరిగ నేర్చుకొనినచో భూమండలమందలి ధనమునంతను సంపాదించినను ఆతనికి హాని కలుగదు అని అలీసంతు చెప్పెను.

ఈవిధముగా ధనమును సంపాదించుటచే లాభములు కలుగును. కాని అధికమగు వైరాగ్యముకలవాడు ధనమును సంపాదింపరాదు. అది ఆతనిచిత్తవిక్షేపమునకు కారణమగును. ఆతడు ధనమును పూర్తిగా త్యజించవలెను. ధనము, దైవభక్తి రెండును ఒకచోట నుండవు.

అటుతరువాత స్వామిశ్రీప్రకాశానందులవారు మొదలగువారు అందరును రాజకోట వెళ్ళిరి.